క్లుప్తంగా

జెడ్పీ పాఠశాలలో సామాజిక తనిఖీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ గ్రామసభ సోమవారం నిర్వహించారు. పాఠశాలలో విద్యా శాఖ విధానాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును జిల్లా రిసోర్స్ పర్సన్ మోహన్ వివరించారు. వాటి అమలుపై తల్లిదండ్రులతో మాట్లాడారు. పేరెంట్స్ తప్పనిసరిగా భోజనం పరిశీలించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులు భుజించేలా ప్రోత్సహించాలని కోరారు. గ్యాస్ పొయ్యిలపై మాత్రమే వంట తయారు చేయాలని పలువురు పేరెంట్స్ కోరారు. పాఠశాలలో గ్రంథాలయం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మోహన్ సూచించారు. ఎస్ఎంసీ చైర్మన్ ఎస్కే బాజీబీ, సభ్యులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలోత్సవం విజయవంతం చేయాలి

తిరువూరు: తిరువూరులో ఫిబ్రవరి 22న బాలోత్సవం జరుగుతుందని నిర్వహణ కమిటీ కార్యదర్శి హరికృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక సుందరయ్య విజ్ఞానకేంద్రంలో బాలోత్సవ సన్నాహక సమావేశం జరిగింది. నియోజకవర్గ స్థాయిలో జరిగే బాలోత్సవంలో అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. అమరావతి బాలోత్సవ కమిటీ సభ్యుడు రామరాజు, తిరువూరు కమిటీ సభ్యులు పాపారావు, రాంప్రదీప్, రామకృష్ణ, శ్రీనివాసరావు, నాగేంద్రప్రసాద్, భరతకుమారి, ఇందిర, సుబానీ, ధనసుందరరావు తదితరులు పాల్గొన్నారు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నూజివీడు: పట్టణంలోని కొన్నంగుంట రోడ్డులోని బేతస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్ (బిస్) ఫెస్టివల్‌ను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఫెస్టివల్‌లో విద్యార్థుల సృజనాత్మక ప్రతిభ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. నృత్యాలు, లఘు నాటికలను విద్యార్థులు ప్రదర్శించి అలరించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం ప్రదర్శనలు, తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్ 3 విజేత నసీరుద్దీన్, రన్నర్ శ్రీకీర్తి ప్రత్యేక సంగీత ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కరస్పాండెంట్ బండి శ్యామ్, డైరెక్టర్లు బండి మెలొడీ, హదస్సా విద్యార్థులను అభినందించారు.

రోడ్ల పనులు ప్రారంభం

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు గ్రామంలో అభివృద్ధి పనులకు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ ప్రజాప్రతినిధులతో కలసి సోమవారం భూమి పూజ చేశారు. ఉపాధి హామీ పథకంలో మంజూరైన రూ.1.50 కోట్లతో వివిధ రోడ్ల నిర్మాణ పనులు చేపడతున్నట్లు ఆయన వెల్లడించారు. మైలవరంలో రూ.22.50 కోట్లు ఎస్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో శరవేగంగా సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలడుగు జోత్స్న, ఎంపీటీసీ సభ్యురాలు గొట్టుముక్కల రాధ పాల్గొన్నారు.

నేటి నుంచి సూర్య నమస్కార సప్తాహం

ఇబ్రహీంపట్నం: ఫిబ్రవరి 4న రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని శాంతివన్ యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగథాన్ 108 సామూహిక సూర్యనమస్కారాల సప్తాహం ఇబ్రహీంపట్నం ఏ కాలనీ అయ్యప్పస్వామి దేవస్థానంలో నిర్వహిస్తామని ఫౌండేషన్ అధ్యక్షుడు, యోగ గురువు లంకె జనార్దన్ సోమవారం తెలిపారు. ఈనెల 28 నుంచి వారం రోజుల పాటు జరిగే కార్యక్రమం ప్రతిరోజు 6 నుంచి 7.15 వరకు ఉదయం, సాయంత్ర రెండు విడతలుగా ఉంటుంది. వివరాలకు 63014 54859 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆలయాల్లో హుండీ కానుకల లెక్కింపు

నూజివీడు: పట్టణంలో దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల హుండీల కానుకలను దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. దీనిలో భాగంగా స్థానిక కోటమహిషాసురమర్దని ఆలయ హుండీల్లో కానుకలను మూడు నెలల కాలానికి లెక్కించగా రూ.1,92,048 ఆదాయం వచ్చింది. దాసాంజనేయస్వామి ఆలయ హుండీ కానుకలను లెక్కించగా రూ.38,265, వేంకటాచలస్వామి ఆలయ హుండీ కానుకలను లెక్కించగా రూ.2,18,802 వచ్చినటు అధికారులు తెలిపారు.

మామిడి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

నూజివీడు: నూజివీడు ప్రాంతంలో మామిడి రైతుల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మామిడి పంట అభివృద్ధికి రూ.30 కోట్ల నిధులు కేటాయించినట్టు ఆయన తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు నిరోధించడానికి, నేరాల అదుపునకు, ప్రజల భద్రతకు లక్ష సీసీ కెమెరాలు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసు వ్యవస్థను మరింత పటిష్ఠ పరుస్తున్నామన్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్త

- శునకాలకు ఎలర్జీ
- ఒళ్లంతా పుండ్లతో జి.కొండూరు వీధుల్లో స్వైర విహారం
- మనుషులకు సోకవచ్చని భయాందోళన
- ఇప్పటికే కుక్కల దాడిలో గాయపడుతున్న గ్రామీణులు

జి.కొండూరు: మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలకు ఎలర్జీ వచ్చింది. పదుల సంఖ్యలో కుక్కలకు ఎలర్జీ బారిన పడ్డాయి. ఇలాంటి కుక్కలకు వెంట్రుకలు ఊడిపోయి, ఒళ్లంతా పుండ్లతో వింత ఆకారంతో దర్శనమిస్తున్నాయి. ఇలా ఎలర్జీ సోకిన కుక్కలు వీధుల్లో స్వైర విహారం చేస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అసలే కరోనా, మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, హెచ్ఎంపీవీ అంటూ రోజుకొక వైరస్ పుట్టుకొచ్చి ప్రజలు బెంబేలెత్తుతుంటే కుక్కలకు సోకిన ఎలర్జీ ప్రజలకు మరో తలనొప్పిగా మారింది. ఇప్పటికే కుక్కలు ప్రజలపై దాడులకు తెగబడుతున్న క్రమంలో వాటికి ఉన్న ఎలర్జీ మనుషులకు సోకితే ప్రాణాలు హాని కలుగుతుందని ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.





చెవుటూరు శివారులో గుంపుగా చేరిన కుక్కలు (ఇన్‌సెట్) జి.కొండూరులో ఎలర్జీ సోకిన కుక్క

ఎలర్జీకి అనేక కారణాలు

వీధి కుక్కలు తరచూ కుళ్లిన ఆహార పదార్థాలు, జంతు కళేబరాలను తినడంతో బురద, దుమ్ము, ధూళిలో తిరిగి వ్యక్తిగత శుభ్రత లేకపోవడంతో ఎలర్జీ బారిన పడుతున్నాయని తెలుస్తోంది. వీధి కుక్కలకు ఎలర్జటిక్ డెర్మటైటిస్, గజ్జి, తామర వంటి వ్యాధులు సోకడంతో వాటికి ఒళ్లంతా వెంట్రుకలు ఊడిపోయి పుండ్లతో బాధపడుతున్నట్లు పశు వైద్యాధికారులు చెబుతున్నారు. ఇలా ఒక కుక్క నుంచి మరో కుక్కకు అంటు వ్యాధిలా ఎలర్జీ పాకుతోందని తెలుస్తుంది. ఎలర్జీ బారిన పడిన కుక్కలు అతి తక్కువ కాలంలోనే శరీరం కుళ్లిపోయి మృతి చెందుతున్నాయి. ఎలర్జీ సోకిన కుక్కలను ఇంటి పరిసరాల్లోకి రాకుండా చూసుకుంటే ఎటువంటి ప్రమాదం వాటిల్లదని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

మైలవరం నియోజకవర్గంలో..

నియోజకవర్గంలో మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం, విజయవాడరూరల్ మండలాల పరిధిలో 65 గ్రామాలు ఉండగా 6వేలకు పైగా వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఇలా ప్రతిరోజూ కుక్కల దాడిలో పదుల సంఖ్యలో ప్రజలు ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అసలే కుక్కలకు ఎలర్జీ సోకుతున్న క్రమంలో ఆ కుక్కలు దాడి చేయడంతో ప్రజలకు ఎలర్జీ సోకుతుందేమోనని భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పెంపుడు కుక్కలతో అప్రమత్తం



పెంపుడు కుక్కలకు ఎలర్జీ సోకుండా ఉండాలంటే వైద్యాధికారుల సూచనలను పాటించాలి. కుక్కల చర్మం సున్నితంగా ఉండటంతో ఎలర్జీలు సోకుతూ ఉంటాయి. పెంపుడు కుక్కలను వీధి కుక్కలతో కలవకుండా చూసుకోవాలి. లేకపోతే వీధి కుక్కలకు సోకిన ఎలర్జీ పెంపుడు కుక్కలతోపాటు ఆ కుటుంబ సభ్యులకు కూడా వచ్చే అవకాశం ఉంది. ఎలర్జీ బారిన పడిన కుక్కలను మా దగ్గరకు తీసుకొస్తే చికిత్స అందిస్తాం.

–ఎస్.శైలజ, పశు వైద్యాధికారి, జి.కొండూరు మండలం

మనుషులకు సోకవచ్చు



ఎలర్జీ సోకిన వీధి కుక్కలు పెంపుడు కుక్కలతో కలిసినప్పుడు ఆ ఎలర్జీ మనుషులకు సోకే అవకాశం ఉంది. కుక్కలు దాడి చేసిన వ్యక్తులకు రేబిస్ వ్యాక్సిన్‌తో పాటు ఎలర్జీ మందులను కూడా ఇస్తున్నాం. సాధ్యమైనంతవరకు ఎలర్జీ సోకిన వీధి కుక్కలను ఇంటి పరిసరాల్లోకి రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా చిన్నారులకు పెంపుడు కుక్కలను దూరంగా ఉంచాలి.

–ప్రసన్నరాణి, మండల వైద్యాధికారి, జి.కొండూరు పీహెచ్‌సీ

మా ఇంట్లో ఇద్దరి పిల్లలపై కుక్కలు దాడి చేశాయి



మా మనవడు, మనవరాలిపై ఇటీవల కుక్కలు దాడి చేశాయి. కుక్కలను నిర్మూలించాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చినా స్పందనలేదు. ఇప్పుడు కుక్కలకు ఎలర్జీలు సోకుతున్నాయి. ఇలా దాడులు చేస్తే కుక్కలకు ఉన్న ఎలర్జీలు మనుషులకు వచ్చే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–పి.సాంబశివరావు, సీపీఎం సీనియర్ నాయకుడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన పరిధిలోని 11 కేవీ అయ్యప్ప స్వామి టెంపుల్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పంచాయతీ ఆఫీస్ ఏరియా, మెడికల్ గోడౌన్ ఏరియా, దేవినేని వారి స్ట్రీట్, గంగానమ్మ గుడి ఏరియాల్లో కరెంట్ ఉండదని పేర్కొన్నారు.

ఆధార్ క్యాంపులు వినియోగించుకోండి

చౌటపల్లి(తిరువూరురూరల్): చిన్నపిల్లలకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను మండలంలో నిర్వహిస్తున్నారని వినియోగించుకోవాలని ఎంపీడీవో రవిబాబు కోరారు. సోమవారం చౌటపల్లిలో ఈ క్యాంపును పరిశీలించిన ఎంపీడీవో మాట్లాడుతూ ఆరేళ్ల లోపు పిల్లలను ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపుల్లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. 28, 29 తేదీల్లో అక్కపాలెం, 30న జీ కొత్తూరులో క్యాంపులు కొనసాగుతాయని తెలిపారు.

31నుంచి గ్రామాల్లో వయోజన విద్య

ఇబ్రహీంపట్నం: ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 31 నుంచి గ్రామాల్లో వయోజన విద్య ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో సునీతశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు మండలం పరిధిలోని 10 గ్రామ పంచాయతీల్లో జరిగే కార్యక్రమానికి ఇప్పటికే 273 మంది వయోజన నిరక్షరాస్యులను గుర్తించామని పేర్కొన్నారు. వారికి అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేసినట్లు తెలిపారు. 27సెంటర్లలో 27మంది వలంటీర్లు, వివిధ శాఖల సిబ్బందికి శిక్షణ ఇచ్చామని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు వయోజన విద్య కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీవో సూచించారు.

కొన్నంగుంట చెరువు పరిశీలన

నూజివీడు: అన్నవరంలోని కొన్నంగుంట చెరువును ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు నోరాకోవిస్, ఆమోదు టీడెన్ సోమవారం పరిశీలించారు. ఈ చెరువును గతంలో ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం (ఏపీఐఐఏటీపీ)లో ప్రపంచ బ్యాంకు నిధులతో చెరువు అభివృద్ధి పనులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అభివృద్ధి చేసిన తర్వాత రైతులు చెరువు ఆయకట్టులో ఎలాంటి మార్పులు తీసుకువచ్చారు, ఏఏ పంటలు పండిస్తున్నారనే వివరాలు తెలుసుకునేందుకు ప్రపంచ బ్యాంకు బృందం విచ్చేసింది. దీనిలో భాగంగా ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు, రబీలో సాగు చేసిన పంటల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్‌లో వరి పంటను, రబీలో మొక్క జొన్న పంటలను సాగు చేస్తున్నట్లు రైతులు చెప్పారు. గతంలో నీరు లేక ఎకరాకు వరి 25 బస్తాల వరకు మాత్రమే దిగుబడి వచ్చేదని, అభివృద్ధి పనులు చేసిన అనంతరం 32 నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వస్తోందని పేర్కొన్నారు. అనంతరం కీటకాల నియంత్రణకు ఉపయోగించే ఫెరోమోన్ బుట్టలు, బయోకల్చర్, సేంద్రియ పద్ధతులతో తయారు చేసిన ఉప ఉత్పత్తుల స్టాల్‌ను ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులు పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా బ్యాంకులు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. కార్యక్రమంలో ఏపీఐఐఏటీపీ సభ్యులు ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ కే చంద్రశేఖర్, ఈఈ టెక్నికల్ ఎం రేవతి, భూగర్భజలశాఖ జేడీ కేఎస్ శాస్త్రి, ఉద్యానశాఖ డీడీ టీవీ సబ్బారావు, అగ్రికల్చర్ ఏడీలు షేక్ సిరాజుద్దీన్, మస్తాన్‌రావు, ఏఓ చాముండేశ్వరి, హెచ్ఓ హేమ, రైతులు పాల్గొన్నారు.



నూజివీడు మండలం అన్నవరంలో పర్యటించిన ప్రపంచ బ్యాంకు బృందం

కాల్వ పూడ్చివేతపై ఫిర్యాదు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి ఖాజీపేటలో మురుగు కాల్వ పూడ్చివేతపై స్థానికులు.. కలెక్టర్ కార్యాలయం పీజీఆర్ఎస్ (ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక)లో సోమవారం పిర్యాదు చేశారు. చాలా ఏళ్లుగా ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్ సమీపం నుంచి గుంటుపల్లి, రాయనపాడు, హైదూరుపాడు, జక్కంపూడి, ముస్తాబాద మీదుగా సుమారు 180 కిలోమీటర్లు ప్రవహించి కొల్లేరులో కలిసే కాల్వను గ్రామ పంచాయతీ అధికారులే పూడ్చడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైందన్నారు. వీటిని తొలగించకుండా ఉన్న కాలువ పూడ్చటంపై అధికారుల ఆంతర్యమేంటని ప్రశ్నించారు. కాల్వ పూడ్చివేతతో భవిష్యత్‌లో భారీ వర్షాలు పడితే ఖాజీపేట, గుంటుపల్లి గ్రామాలు నీటి ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కాలువ పూడ్చివేత పనులు నిలిపేయాలని కోరారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



మైలవరం: నియోజకవర్గ స్థాయిలో మండలంలోని చంద్రగూడెం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన క్రీడా సంబరాల్లో మైలవరం ఎస్ఎస్‌కే విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి మోహనరావు తెలిపారు. మైలవరం ఎస్ఎస్‌కే పాఠశాలలో సోమవారం స్కూల్ డైరెక్టర్ మోహనరావు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో జరిగిన క్రీడాపోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి 12 ఈవెంట్‌లకు 9 గెలుచుకున్నట్లు తెలిపారు. క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ గొల్లపూడి భావన, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

నాణ్యతతో అర్జీలను పరిష్కరించాలి

- ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 34 అర్జీలు
- సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన అర్జీలను నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం)ను నిర్వహించి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. దీనిలో 34 అర్జీలు రాగా పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యమివ్వాలని, నాణ్యతతో కూడిన పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ వెంకటరత్నం, డీఎల్‌పీఓ ఎంపీఎస్ సుందరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, హెచ్ఓ హేమ పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్

ప్రజల నుంచి వచ్చిన అర్జీల్లో కొన్ని

- నూజివీడు మండలం వెంకటాయపాలెంకు చెందిన అంబోజి ధనలక్ష్మి తన భర్త మృతి చెంది ఏడేళ్లైందని, అప్పటి నుంచి పలుమార్లు వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నా ఇంత వరకు మంజూరు కాలేదని, వెంటనే మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు.
- పట్టణంలోనిఓ ప్రైవేటు స్కూల్లో ఇన్‌చార్జిగా పని చేసిన కాలానికి సంబంధించి తనకు జీతం బకాయిలు రూ.1.80 లక్షలు రావాల్సి ఉన్నా యాజమాన్యం చెల్లించడం లేదని, తనకు న్యాయం చేయాలంటూ నూజివీడులోని అమ్మవారితోట ప్రాంతానికి చెందిన షేక్ అబేదా సబ్‌కలెక్టర్‌కు అర్జీని అందజేశారు.
- నూజివీడు పట్టణ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో ప్లాట్ నంబరు 1029ని 2022లో మేకపోతుల వెంకటేశ్వరరావు వద్ద కొనుగోలు చేశానని అందులో బేస్‌మెంట్ నిర్మించుకోగా, విజయవాడకు చెందిన ముస్లిం మహిళ వచ్చి ఆ స్థలం తనదంటూ వచ్చి కాజేయాలని చూస్తోందని, ఆమె బారి నుంచి కాపాడి తనకు న్యాయం చేయాలని కోరుతూ నూజివీడు మండలం పోతురెడ్డిపల్లికి చెందిన గొల్లమందల సుష్మ అర్జీని అందజేశారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోండి

ఆగిరిపల్లి: పశువైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రమణారావు అన్నారు. మండలంలోని సగ్గూరులో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి హనుమంతరావు ఆధ్వర్యంలో గేదెలు, మేకలు, గొర్రెలకు వైద్య సేవలు అందించి నట్టల నివారణ మందును ఉచితంగా వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చౌటపల్లిలో పశువైద్య శిబిరం

చౌటపల్లి(తిరువూరురూరల్): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన సోమవారం మండలంలోని చౌటపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి స్వప్న పశువులకు చైడు పరీక్షలు, ఎదకు రాని పశువులకు చికిత్సలు చేశారు. పాడిపశువులకు, మేకలకు, దూడలకు నట్టల నివారణ మందు వేశారు. పాడి పశువు ఈనిన 45 రోజుల నుంచి 60 రోజుల్లో పొల్లిస్తే చూడు నిలిచే అవకాశం ఉంటుందని, ఏటా దూడని పొందడంతో పాల ఉత్పత్తి పెరుగుతుందని పశువైద్యాధికారి స్వప్న తెలిపారు. 114 పశువులకు వైద్య పరీక్షలు చేసి 185 మేకలకు నట్టల మందు వేశారు. తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, వెటర్నరీ అసిస్టెంటు నూతక్కి రాఘవరావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆవుకు వైద్య పరీక్షలు చేస్తున్న పశు వైద్యాధికారులు

చాట్రాయి: పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని చాట్రాయి పశువైద్యాధికారి శివ నాగేంద్రబాబు తెలిపారు. సోమవారం మండలంలోని చీపురుగుగూడెంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూడలు, పశువులకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. అనంతరం పశుపోషకులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

వరిలో కలుపు నివారణ చేపట్టాలి

తిరువూరు: దాళ్వా వరి సాగులో కలుపు నివారణ చేపడితే దిగుబడి ఎక్కువ వస్తుందని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ సూచించారు. మండలంలో వివిధ పంటలు సాగుచేసే రైతులకు ఆమె సస్యరక్షణ చర్యలు తెలిపారు. వరి.. మండలంలో 4,991 హెక్టార్లలో సాగవుతుండగా 1,150 హెక్టార్లలో వెదజల్లే పద్ధతిలో నాట్లు వేశారని, ఇంత వరకు 3,841 హెక్టార్లలో నాట్లు వేశారని పేర్కొన్నారు. పెసర 3.6 హెక్టార్లలో మినుము 8 హెక్టార్లలో, మొక్కజొన్న 45.6 హెక్టార్లలో సాగు చేస్తున్నట్లు తెలిపారు. వెదజల్లే పద్ధతిలో ఎకరాకు రూ.5వేలు సాగు ఖర్చు ఆదా అవుతుందని పేర్కొన్నారు. అపరాల సాగుతో కూడా రైతులకు తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం పొందవచ్చని తెలిపారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ సాగుకు రైతులు ప్రాధాన్యమిస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్

చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో బ్రహ్మాచారి తెలిపారు. సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో 10వ తరగతి విద్యార్థులకు డెమోక్రటిక్ పీఆర్‌టీయూ ఆధ్వర్యాన స్టడీ మెటీరీయల్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'పది' విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ఆ శాఖ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగేశ్వరావు, వెదుళ్ల వెంకటేశ్వరావు, తేరా రామారావు, పరసా శ్రీనివాసరావు, పానుగంటి భారతి, ఎస్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: డీపీఆర్టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన పదవ తరగతి స్టడీ మెటీరియల్ పుస్తకాలను ఎంఈఓ సర్వేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి వంశీ వశిష్ఠ, జిల్లా కార్యదర్శి నాగలక్ష్మి, గౌరవ అధ్యక్షుడు బీవీఎస్ లక్ష్మి, శివతేజ పాల్గొన్నారు.

గ్యాస్ స్టౌ సర్వీస్ సెంటర్‌పై విజిలెన్స్ దాడి

ఇబ్రహీంపట్నం: భారత్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వచేసిన గాయత్రి గ్యాస్ స్టౌ, స్పేర్‌పార్ట్స్ సెంటర్‌పై విజిలెన్స్ అధికారులు సోమవారం మెరుపుదాడి చేశారు. విజిలెన్స్ సీఐ ఉమర్ నేతృత్వంలో జరిగిన దాడిలో అక్రమంగా నిల్వచేసిన 20 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. గతంలో షణ్ముఖ గ్యాస్ ఏజెన్సీలో పనిచేసిన వ్యక్తితోనే సర్వీస్ సెంటర్ ద్వారా బ్లాక్‌లో అధిక ధరలకు గ్యాస్ సిలిండర్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లను సీజ్‌చేసి కొండపల్లిలోని మరో గ్యాస్ ఏజెన్సీకి తరలించారు. గుంటుపల్లి షణ్ముఖ గ్యాస్ ఏజెన్సీ గోడౌన్‌లో కూడా తనిఖీలు చేశారు. 3గ్యాస్ సిలండర్‌లు లెక్కలో చూపకపోవడం గుర్తించారు. అక్రమ గ్యాస్ సిలండర్‌ల నిల్వలపై జాయింట్ కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్లు సీఐ ఉమర్ తెలిపారు. పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ బి.రామకృష్ణ, వీఆర్వో విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పైడూరుపాడు రైతులకు న్యాయం చేయండి

పైడూరుపాడు(విజయవాడరూరల్): ఖమ్మం నుంచి విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణంలో వ్యవసాయ భూములు కోల్పోతున్న పైడూరుపాడు రైతులకు నష్టపరిహారం చెల్లింపు విషయంలో న్యాయం చేయాలని గ్రామ రైతులు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశకు సోమవారం వినతిపత్రంలో కోరారు. సర్పంచి వేముల సీతారామయ్య ఆధ్వర్యాన గ్రామంలో వ్యవసాయ భూములు కోల్పోతున్న రైతులు కలెక్టర్‌ను ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. పైడూరుపాడు గ్రామ రైతులకు నష్టపరిహారం ఎకరాకు రూ. 11. 60 లక్షలు మాత్రమే ఉన్నాయని ఆ గ్రామానికి ఆనుకొని వున్న జక్కంపూడి గ్రామానికి ఎకరానికి 76 లక్షలు, రాయనపాడు గ్రామానికి 34.70లక్షలు, కవులూరు గ్రామానికి రూ.26.50లక్షల నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సెక్షన్26-బి యాక్టును అనుసరించి పైడూరుపాడు గ్రామ రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని వారు విజ్ఞప్తి చేశారు. వి.కోటేశ్వరరావు, రామకృష్ణ, నాగేశ్వరరావు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ నిర్వహిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరిరావు తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి అధ్యక్షతన కొండపల్లి ఐడీఏలో జరిగిన లయన్స్ క్లబ్ సమావేశంలో సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఐడీఏలో ఏటీఎం కౌంటర్, సులభ్ కాంప్లెక్స్, ఆరోగ్య కేంద్రం, ప్యూరిఫైడ్ వాటర్, మొక్కలు పెంపకం వంటి సేవలు నిర్వహించి జిల్లాలో అత్యుత్తమ క్లబ్‌గా నిలిచిందన్నారు. సమాజంలో అస్తవ్యస్తంగా మారిన కుటుంబ వ్యవస్థను లైనిజం ద్వారా మార్పు తేవడానికి ప్రయత్నించాలని సూచించారు. డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్‌లు బి.కృష్ణారెడ్డి, సీహెచ్ వెంకటేశ్వరరావు, బుల్లిరాజుచౌదరి, దీపక్‌కుమార్, కార్యదర్శి సురేష్, నాగిరెడ్డి, విజయబాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చాట్రాయి: చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామకృష్ణ సోమవారం తెలిపారు. కోటపాడుకి చెందిన బజ్జూరి శివ, బూరుగుగూడెంకు చెందిన సుబ్బలక్ష్మి (32)కి 16 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ నెల 22న సుబ్బలక్ష్మికి ఆమె భర్త శివ మధ్య గొడవ జరిగింది. మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగు మందును ఆమె తాగింది. ఆమెను చింతలపూడి ప్రభుత్వాస్పత్రికి ఆమెను తరలించారు. పరిస్థితి విషమించడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె ఈ నెల 26న మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సోమవారం సారా తయారీ కేంద్రాలపై అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లిలో, గంపలగూడెం మండలం అనుముల్లంక గ్రామాల్లో 400 లీటర్ల చొప్పున బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. తిరువూరు ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణవేణి ఆధ్వర్యాన జరిగిన దాడుల్లో సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు

మైలవరం ఎమ్మెల్యే వసంత

మైలవరం: విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అని, దావోస్ పర్యటనతో రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటనపై వైఎస్సార్ సీపీ వ్యాఖ్యలను ఖండించారు. మైలవరంలో ఎక్కువ నిధులు తీసుకువచ్చి అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.